క్లుప్తంగా

ఏఈవోల సంఘం ఈసీ మెంబర్‌గా రియాజ్‌బాషా

పత్తికొండ(తుగ్గలి) : వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక మండలి(ఈసీ మెంబర్)సభ్యుడుగా పత్తికొండ ఏఈవో రియాజ్ బాషా ఎన్నికయ్యారు. ఈనెల 9వ తేదీన విజయవాడలో ఏపీ ఎన్జీవో కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం ఎన్నికల్లో రియాజ్‌బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రియాజ్‌బాషా ఎన్నిక పట్ల ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్, ఏఓ వెంకటరాముడు, సహచర ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

ఒత్తిడి వీడండి


పరీక్షా పే చర్చలో పాల్గొన్న ఎంఈఓ, ఎస్ఓ

వెల్దుర్తి: పదవ తరగతి విద్యార్థులు పరీక్షల పట్ల భయం, ఒత్తిడి వీడి బాగా రాయాలంటూ ఎంఈఓ ఇందిర సూచించారు. స్థానిక కేజీబీవీలో పదవ తర గతి విద్యార్థినులకు సోమవారం అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షా పే చర్చ కార్యక్రమంలో భాగమయ్యారు. ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎస్ఓ షాకీరా బేగం ఉన్నారు.

గడ్డివామి, పశువుల పాక దగ్ధం

దేవనకొండ: మండలంలోని తెర్నేకల్ గ్రామంలో బీత్తర నడిపి మాదన్నకు చెందిన పశువుల పాక, వామిదొడ్డి అగ్నికి ఆహుతైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వామిదొడ్డిలో నిల్వ ఉంచిన పశుగ్రాసం, ఎద్దులబండి, వ్యవసాయ సామగ్రి కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా, సిబ్బంది వచ్చే లోపు గ్రాసం మొత్తం కాలిపోయింది. ప్రమాదంలో సుమారు రూ.లక్షన్నర దాకా నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

దేవనకొండ ఆసుపత్రి తనిఖీ


వైద్యులతో మాట్లాడుతున్న డాక్టర్ భాస్కర్

దేవనకొండ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే ఆసుపత్రి పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా స్కూల్‌లో జరుగుతున్న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీని తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ రఘురామిరెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారులు విజయభాస్కర్, వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా, సూపర్‌వైజర్‌లు రంగస్వామి, శ్రీధర్, మద్దిలేటి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ


దేవమ్మవ్వ విగ్రహం

ఆలూరు: స్థానిక కోటవీధిలో నూతనంగా నిర్మించిన శ్రీదేవమ్మవ్వ ఆలయంలో సోమవారం శ్రీ దేవమ్మవ్వ విగ్రహాన్ని భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠించారు. శివరుద్రయ్యస్వామి, మహేష్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. జెడ్పీటీసీ ఏరూరుశేఖర్, ఎంపీపీ రంగమ్మ, సర్పంచ్ అరుణాదేవి, వైస్ ఎంపీపీ నాగవేణి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి


చిప్పగిరి కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఐఓ నాగ ప్రసాద్

ఆలూరు రూరల్: బాలికలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నాగ ప్రసాద్ అన్నారు. చిప్పగిరి పీహెచ్‌సీ సెంటర్‌ను సోమవారం తనిఖీ చేశారు. అనంతరం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా చిప్పగిరి కేజీబీవీ విద్యార్థినులకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యురాలు అఫ్రోజ్ జహాన్, సూపర్‌వైజర్లు పద్మావతి,విమల,ఏఎన్ఎం సరళ ఉన్నారు.

పంచాయతీ సెక్రటరీకి సత్కారం


రాజశేఖర్‌ను సత్కరిస్తున్న సిద్ధేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తలు

హొళగుంద: సిద్ధేశ్వరస్వామి ఉత్సవాల్లో పంచాయతీ తరఫున అందించిన సహకారానికి కృతజ్ఞతగా స్థానిక పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్‌ను ఆలయ ధర్మకర్తలో ఒకరైన సిద్ధార్థగౌడ్, గ్రామస్తులు సోమవారం సత్కరించారు. ఉత్సవాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టడంతో పాటు ప్రధాన రోడ్లు, వీధులో దుమ్ము ధూళి లేవకుండా ట్యాంకర్‌తో నీళ్ల వెదజల్లిండం పనులు అంతరాయం లేకుండా చేపట్టారని అభినందించారు. రవికాంత్, పణి, రేణుస్వామి ఉన్నారు.

గురుకులం పిలుస్తోంది

- ఐదవ తరగతి,ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు
- మార్చి 6న దరఖాస్తుకు తుది గడువు.. ఏప్రిల్ 6న ప్రవేశ పరీక్ష
- అరికెర గురుకులంలో మొత్తం 160 సీట్లు



డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, అరికెర

ఆలూరు రూరల్: పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు గురుకులం దరఖాస్తులు కోరుతోంది. పేద, మధ్య తరగతి వర్గాల్లోని ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాలల్లో ఐదవ తరగతి, ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల విద్యార్థులు ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. కార్పొరేట్ తరహాలో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు మార్చి 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకసారి సీటు పొందితే వసతితో పాటు ఇంటర్మీడియెట్ వరకూ ఉచితంగా చదువుకోవచ్చు. ఇంగ్లిష్ మీడియంలో బోధనతో పాటు నీట్,ఐఐటీలో ఉచితంగా శిక్షణ ఇస్తారు. విద్యార్థులు ఏప్రిల్ 6న జరిగే కామన్ టాలెంట్ ఎంట్రెన్స్‌లో ప్రతిభ చూపి ప్రవేశాలు పొందవచ్చు. ఆలూరు మండలం అరికెర గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదవ తరగతికి 80 సీట్లు ఉన్నాయి. అలాగే జూనియర్ ఇంటర్‌లో సీఈసీ గ్రూపునకు 40 సీట్లు, ఎంఈసీ గ్రూపునకు 40 సీట్లు కేటాయించారు. ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసినప్పుడు నీట్, ఐఐటీ శిక్షణల్లో దేనిని తీసుకుంటారో ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిర్వహించే కామన్ పరీక్షలకు పంపుతారు. అక్కడ ప్రతిభ చూపితే రాష్ట్ర స్థాయి ప్రతిభా పరీక్షలకు పంపుతారు.

సద్వినియోగం చేసుకోండి

గురుకులాల్లో ఐదు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. పేద,మధ్య తరగతి విద్యార్థులకు ఇది చక్కని అవకాశం, సద్వినియోగం చేసుకోవాలి. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు అన్ని సౌకర్యాలతో ఉచిత విద్యను అందిస్తాం.

– మనోరాజు, గురుకులం ప్రిన్సిపాల్, అరికెర

అర్హతలు..

- ఐదవ తరగతిలో ప్రవేశానికి ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ,బీసీ, బీసీ–సీ, విద్యార్థులు 2014 సెంప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు 2023–24 ఏడాదిలో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న వారు అర్హులు. వయసు 2025 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు దాటి ఉండరాదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఏడాది సడలింపు ఉంటుంది. విద్యార్థులు సొంత జిల్లాలో 2023–24 ఏడాదిలో 3వ తరగతి, 2024–25లో 4వ తరగతి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలి. ఐదు, ఇంటర్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష దాటకూడదు.

దరఖాస్తు ఇలా..

- గురుకులంలో ప్రవేశానికి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఐదవ తరగతికి https://apgpcet.apcfss.in వెబ్‌సైటులో దరఖాస్తు చేసుకోవాలి. ఇంటర్ కోసం https://apgpcet.apcfss.in inter ద్వారా మార్చి నెల 6న సాయంత్రం 5 గంటల లోపు నమోదు చేసుకోవాలి. విద్యార్థులు ఎంపిక చేసుకున్న పాఠశాల/కళాశాల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి. వివరాలు సబ్మిట్ చేసిన తర్వాత మార్చుకునే అవకాశం ఉండదు.

ప్రారంభమైన 'పది' ప్రీ ఫైనల్

తుగ్గలి : పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆయా పాఠశాలల్లో సోమవారం తెలుగు పరీక్ష నిర్వహించారు. 11న హిందీ, 12న ఇంగ్లిష్, 15న గణితం , 17న ఫిజికల్ సైన్స్, 18న బయాలజికల్ సైన్స్, 20 సోషల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ రామ వెంకటేశ్వర్లు తెలిపారు.

భూ ఆధార్ తప్పనిసరి

తుగ్గలి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతులకు వ్యవసాయ పథకాలు వర్తించాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన పోర్టల్‌లో రైతులు రిజిస్టర్ చేయించుకోవాలని ఏడీఏ మోహన్ విజయకుమార్ తెలిపారు. సోమవారం రాతన రైతు సేవా కేంద్రంలో భూ ఆధార్ నమోదును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. భూమి ఉన్న ప్రతి రైతు దగ్గర్లోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి భూ వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. పోర్టల్‌లో నమోదు చేసుకుని కోడ్ నంబర్ వచ్చిన రైతులకు మాత్రమే సబ్సిడీలు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ,, సూక్ష్మసేద్యంపై రాయితీ వర్తిస్తాయన్నారు. రైతులు త్వరితగతిన భూ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఏఓ పవన్‌కుమార్, ఏఈవో మల్లీశ్వరి పాల్గొన్నారు.

టెనెక్ట్‌ప్లస్‌తో గుండెకు భరోసా

- అందుబాటులో గుండెపోటు నివారణ సూది మందు


ఆలూరు సీహెచ్‌సీలో రోగులు,ప్రజలకు గుండెపోటు నివారణ సూది మందుపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వాహిద్

ఆలూరు రూరల్: గుండె పోటుకు గురైన వ్యక్తులకు మొదటి గంటలోపు ఆసుపత్రికి తీసుకొస్తే టెనెక్ట్‌ప్లస్ అనే సూది మందు ఇస్తే ప్రాణాపాయం నుంచి కాపాడుతుందని ఆలూరు సీహెచ్‌సీ ప్రధాన వైద్యులు వాహిద్ ప్రజలకు సూచించారు. స్థానిక సీహెచ్‌సీలో సోమవారం ప్రజలకు, రోగులకు రూ.45 వేలు విలువైన సూది మందుపై అవగాహన కల్పించారు. ఛాతీ నొప్పి,ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పభుత్వ ఆసుపత్రిలో చేర్పించాలన్నారు. ఆ లక్షణాలు గుండెపోటుకు గురైనప్పుడు కనిపిస్తాయి. ప్రాథమిక పరీక్ష చేసి వైద్యులు మొదటి గంటలోపు రూ.45 వేల విలువైన టెనెక్ట్‌ప్లస్ అనే ఇంజెక్షన్ ఉచితంగా రోగికి వేస్తారని చెప్పారు. దీంతో రోగి ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రాష్ట్రం ప్రభుత్వం ఈ సూది మందును అందుబాటులో ఉంచిదని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యులు, శ్రీకాంత్, సంధ్య ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

తాడిపత్రి ఎద్దుల జయకేతనం


నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

వెల్దుర్తి: కాశిరెడ్డినాయన, కోటపేట ఆంజనేయస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి అఖిలభారత ఒంగోలు గిత్తల న్యూ కేటగిరి విభాగంలో నిర్వహించిన ఎద్దుల బండలాగుడు పోటీల్లో తాడిపత్రి నాగూరు రాజశేఖర్ రెడ్డి వృషభాలు సత్తాచాటాయి. 6,300 అడుగుల మేర బండ లాగి మొదటి స్థానంలో నిలిచి రూ.50వేలు గెలుచుకున్నాయి. పోటీలను శ్రీరంగాపురం గ్రామపెద్దలు ప్రారంభించగా హోరాహోరీ పోరులో తర్వాతి 7 స్థానాల్లో వరుసగా అనంతపురం జిల్లా ఇంద్రారెడ్డి వృషభాలు, మల్యాల ఎస్ఎస్‌వీ ట్రేడర్స్ వృషభాలు, అనంతపురం లక్ష్మీపల్లె గూడూరు శివారెడ్డి, డోన్ సీసంగుంతల రాజు వృషభాలు సంయుక్తంగా, కొత్తకోట కంబయ్య, కైరవాడి లక్ష్మన్న, వైఎస్సార్ జిల్లా గొల్లపల్లి వారాది రామ్‌చరణ్ , అనంతపురం జిల్లా సోమలదొడ్డి తోట వీరశేషారెడ్డి వృషభాలు రూ.40వేలు, రూ.35వేలు, రూ.25వేలు, రూ20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు గెలుచుకున్నాయి.

గుండు పందెం విజేతలు..

గుండు ఎత్తు పందెంలో గోసానిపల్లెకు చెందిన చందు, అర్జున్ ప్రతిభ చాటారు. గుండును పలుమార్లు ఎత్తి సమఉజ్జీలుగా నిలిచారు. ఇరువురిని విజేతలుగా ప్రకటించిన నిర్వాహకులు బహుమతి 6 తులాల (4+2) వెండిని సమానంగా అందించారు.

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

- ఆర్డీఓ భరత్ నాయక్



ఆర్డీవో భరత్‌నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

పత్తికొండ రూరల్: పత్తికొండ డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు ఆక్రమణదారులు ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జీఓ నంబర్ 30 అనుసరించి ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం- 2025 పేరిట భూముల క్రమబద్ధీకరణకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆక్రమణదారుల కుటుంబంలోని మహిళలకే ఈ అవకాశం ఉంటుందన్నారు. లబ్ధిదారులకు పట్టా, రిజిస్ట్రేషన్ పత్రం అందిన రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు లభిస్తాయన్నారు. 2019 అక్టోబరు 15కు ముందు ఆక్రమణలో ఉన్న భూములను మాత్రమే నిబంధనల మేరకు క్రమబద్ధీకరిస్తామని స్పష్టం చేశారు. బీపీఎల్ కుటుంబాలకు 150 గజాల వరకు ఉచిత రిజిస్ట్రేషన్, ఆపై బడిన వాటికి భూమి ప్రభుత్వ ధరలో, రిజిస్ట్రేషన్‌లోనూ నిబంధనల మేరకు రుసుము చెల్లించాల్సి ఉటుందని వెల్లడించారు. బీపీఎల్ కాని కుటుంబాలు అన్ని రకాల ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. లేఅవుట్‌లు, కాలువలు, వంకలు, వాగులు, మాస్టర్, జోనల్ ప్లాన్‌లకు సంబంధించిన వాటిల్లో ఆక్రమిత భూముల క్రమబద్ధీకరణ జరగదని తెలిపారు. తహసీల్దార్ పర్యవేక్షణలో అర్హత కలిగిన వారిని పరిశీలించి, లబ్ధిదారుల జాబితా గ్రామ, వార్డు కార్యాలయాల్లో ప్రదర్శించి, అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

సాగునీటి సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు అఖిలపక్ష పార్టీల నాయకులతో కలిసి సోమవారం ఆర్డీవో భరత్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో దశాబ్దాలుగా కరువుతో తాగు,సాగునీరులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పందికోన రిజర్వాయర్ కింద దాదాపు 60వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చి, 106 చెరువులకు సాగునీరు మళ్లించాల్సి ఉండగా పనులు పూర్తికాక రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. తుగ్గలి, మద్దికెర మండలాల్లో మినీ రిజర్వాయర్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబిరసూల్, సీపీఎం మండల కార్యదర్శి చక్రాల్ల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు సోమశేఖర్, మండల అధ్యక్షుడు కారం నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా కాశిరెడ్డి నాయన ఆరాధన


కిక్కిరిసిన కాశిరెడ్డినాయన క్షేత్రం

వెల్దుర్తి: శ్రీరంగాపురం కొండల్లో ఏర్పాటైన నిత్యాన్నదాన క్షేత్రం కాశిరెడ్డినాయన ఆశ్రమంలో అవధూత కాశిరెడ్డినాయన, సమీప కోటపేట ఆంజనేయస్వామి వారి 15వ ఆరాధనోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. నిర్వాహకులు రామచంద్రారెడ్డి, శ్రీరంగాపురం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఉదయం గణపతి పూజతో ప్రారంభమయ్యాయి. వెల్దుర్తి, బేతంచెర్ల, డోన్, ప్యాపిలి, పత్తికొండ, కర్నూలు మండలాల నుంచి విచ్చేసిన భక్తులతో ఆశ్రమం కిక్కిరిసింది. కాశిరెడ్డినాయనకు పల్లకీసేవ, ఊరేగింపు, అనంతరం కోటపేట ఆంజనేయస్వామితో పాటు ఆశ్రమం పక్కనే వెలసిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి, లక్ష్మీ నరసింహస్వామి వార్ల వార్షికోత్సవం సందర్భంగా స్వామి వార్లకు, నాగ ప్రతిమలు, నవగ్రహాలకు, సమీప వైష్ణవ క్షేత్రంలోని పాలుట్ల రంగస్వామికి భక్తులు విశేష పూజలు చేపట్టారు. సాయంత్రం నందికోల సేవ, జ్యోతి జ్వాల కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. నటరాజ కళాబృందం వారి నాటక ప్రదర్శన అలరించింది.


ప్రత్యేక అలంకరణలో అవధూత కాశిరెడ్డి నాయన

16 నుంచి దస్తగిరయ్యస్వామి ఉరుసు

కృష్ణగిరి: మండల కేంద్రమైన కృష్ణగిరిలో వెలసిన జగద్గురు దస్తగిరయ్య స్వామి ఉరుసును ఈ నెల 16వ తేదీ నుంచి మూడురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. 16న సాయంత్రం ఫకీరుల ఆధ్వర్యంలో మేళతాళాలు, భక్త బృందంతో స్వామికి గంధం సమర్పణ, రాత్రి భజన కార్యక్రమంతోపాటు, ఖవ్వాలి ఉంటుందని చెప్పారు. 17న ఉరుసు, 18న కిస్తీతో వేడుకలు ముగుస్తాయన్నారు.

రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలి

ఆలూరు రూరల్: రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని బెల్డోణ సొసైటీ సీఈవో హరికృష్ణ తెలిపారు. బెల్డోన సొసైటీ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. సహకారం సంఘంలో 4,678 సభ్యులు ఉన్నారని, వారిలో 957 మంది రైతులు సొసైటీలో రుణాలు పొందారని చెప్పారు. రూ.28 కోట్ల బకాయిలు ఉన్నాయని..ఇందులో దాదాపు రూ.20 కోట్ల వరకు మొండి బకాయిలు ఉన్నాయని చెప్పారు.

నీటి సమస్య తలెత్తనీయొద్దు

దేవనకొండ: వేసవి ప్రారంభం కావడంతో మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి నరసారావు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సూర్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని చాలా గ్రామాల్లో ఇప్పటికే ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంచినీటి పైపులైన్లు లీకేజీలతో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదన్నారు. సుల్తాన్, కృష్ణ, నరసింహా, రఫీ, ఆంజనేయ, మాదన్న పాల్గొన్నారు.

సేవలను వినియోగించుకోండి

వెల్దుర్తి: స్థానిక సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న సేవలు ప్రజల ఉపయోగించుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బాలచంద్రారెడ్డి కోరారు. సోమవారం ఆసుపత్రిలో రోగులు, గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుండెనొప్పి వచ్చిన వారు గంటలోపు ఆసుపత్రిని సంప్రదిస్తే వెంటనే ఈసీజీ తీసి అవసరమైతే రూ.48వేల ఇంజెక్షన్ ఉచితంగానే అందించి ప్రాణాలు నిలిపేలా ప్రయత్నిస్తామన్నారు. వైద్యులు రంగస్వామి, రాజశేఖర్, ఫార్మాసిస్టులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం

వెల్దుర్తి: మతాతీత జ్ఞానాన్ని సర్వమానవాళికి ఆధ్యాత్మిక సంపదను అందించే త్రైత సిద్ధాంతాన్ని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు తన గ్రంథాల్లో తెలియజేశారని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి డోన్ ఇందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు నాగార్జున తెలిపారు. సోమవారం మండలంలోని మదార్‌పురంలో కమిటీ సభ్యులతో కలిసి ఇంటింటి ప్రచారం చేసి, గ్రంథాలను పంపిణీ చేశారు. మాఘ మాసం, శివరాత్రి పర్వదినాల ప్రత్యేకతను వివరించారు. సభ్యులు సుబ్బయ్య, శివకుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణ పనులు ప్రారంభం

హొళగుంద: గజ్జహళ్లి గ్రామంలోని పోతులింగేశ్వర స్వామి ఆలయ పక్కన శిథిలావస్థకు చేరిన ఆంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులను సోమవారం ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఆలయ ధర్మకర్తలు హనుమంతరెడ్డి, తిమ్మారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు చేపట్టారు. గ్రామస్తుల సహకారంతో నూతన ఆలయ నిర్మాణ పనులు చేపడ్తున్నట్లు ధర్మకర్తలు తెలిపారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మద్దికెర : స్వచ్ఛంద సేవా సంస్థలు ఏర్పాటు చేసే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున అన్నారు. సోమవారం స్థానిక సుబ్రహ్మణ్య స్వామి దేవాలయ ఆవరణలో డ్రామా, సినీయాక్టర్ ఎస్వీ ప్రసాద్ జ్ఞాపకార్థం ఉచిత గుండె, కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ధనుంజయ, ఆలయ నిర్వాహకులు విజయ్, ఆపద్బంధు సేవా సమితి అధ్యక్షుడు సునీల్‌కుమార్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఆ అధికారులకు ఏమైంది?


తుగ్గలిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు తహసీల్దార్ మాత్రమే హాజరైన దృశ్యం

తుగ్గలి : ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వేదిక మొక్కుబడిగా సాగింది. స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని కొందరు అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. అందుకు సాక్ష్యమే ఈ చిత్రం. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి తహసీల్దార్ రమాదేవి మాత్రమే హాజరయ్యారు. కొద్దిసేపటి తర్వాత హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వచ్చారు. మిగిలిన శాఖల అధికారులంతా డుమ్మా కొట్టేశారు. దీంతో కార్యాలయం వెలవెల బోయింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్న 1గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించాలని, అనంతరం వాటి పరిష్కారానికి చర్యలు తీసు కోవాలన్న లక్ష్యంతో చేపట్టిన వేదిక అధికారుల నిర్లక్ష్యానికి గురవుతోంది. కార్యక్రమం మొక్కుబడిగా సాగుతుండటంతో వినతులు ఇచ్చేందుకు కూడా ప్రజలు ఆసక్తి చూపడం లేదు.

ఆల్బెండజోల్‌తో రక్తహీనత దూరం


సిద్ధాపురంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న వైద్యాధికారి తిమ్మయ్య

కృష్ణగిరి: ఆల్బెండజోల్ మాత్రలతో చిన్న పిల్లల్లో రక్తహీనతను నివారించవచ్చని వైద్యాధికారులు ప్రదీప్, వరప్రసాద్ తెలిపారు. సోమవారం నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, కంబాలపాడు ప్రాథమిక పాఠశాల, స్థానిక కస్తూర్బా విద్యాలయంలో ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఎంఈఓ–2 మద్దయ్యతో కలిసి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మండలంలోని 47 పాఠశాలలు, మూడు కాలేజీలు, 42 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 9,922 మంది చిన్నారులకు గాను 9,422 మంది చిన్నారులకు మాత్రలు పంపిణీ చేసినట్లు చెప్పారు.

- ఆలూరు రూరల్: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించవచ్చని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి తెలిపారు.జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు మాత్రలు పంపిణీ చేశారు.
- వెల్దుర్తి: 19 ఏళ్లలోపు వారిలో నులిపురుగుల నివారణకు అంగన్‌వాడీలు, పాఠశాలల్లో చిన్నారులకు, విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ సోమవారం 93శాతం పూర్తి చేసినట్లు గోవర్ధనగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మండల పరిధిలోని మదార్‌పురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న మాత్రల పంపిణీలో పాల్గొన్నారు.
- మద్దికెర : మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని ప్రభుత్వ వైద్యులు రాగిణి, శ్రీలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు అజరయ్యబాబు అన్నారు. సోమవారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థులకు 400 ఎంజీ ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా పాల్గొన్నారు.
- హాలహర్వి: మండంలోని సిద్ధాపురం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా వైద్యాధికారులు గంగాధర, తిమ్మయ్య, స్రవంతి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. అలాగే స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో డాక్టర్లు మన్సూర్‌వలి, గంగాధర విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.


మద్దమ్మ దేవాలయం (ఇన్‌సెట్)మద్దమ్మ మూల విరాట్

భక్తుల పెన్నిధి మద్దమాంబ


- 12 నుంచి నుంచి ఉత్సవాలు
- 13న రథోత్సవం
- నాటి మాధవీకెర నేటి మద్దికెర
- రాష్ట్రంలోనే అతి పెద్ద చెక్క విగ్రహం

మద్దికెర : తనను కొలిచే భక్తులను అక్కున చేర్చుకుంటూ వారి కోరికలను నెరవేర్చుతూ మద్దమ్మగా భాసిల్లుతోంది మాధవీమాత (మద్దమాంబ). ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశారు. ఉత్సవాలను తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారు. భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజించి మొక్కులు తీర్చుకుంటారు. మండల కేంద్రం మద్దికెరలో వెలసిన మద్దమ్మ ఉత్సవాలు ఈనెల 12వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. అమ్మవారికి 12న రాత్రి 9 గంటలకు లగ్నోత్సవం, 10 గంటలకు మాంగల్యధారణ జరుగుతుంది. 13న సాయంత్రం రథం ముందు హోమం, అశేష భక్తజం మధ్య అమ్మవారి రథోత్సవం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 14న పారువేటతో వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ఆలయ విశిష్టత.. :ప్రస్తుతం మద్దికెరగా పిలువబడుతున్న ఈ గ్రామం ఒకప్పుడు మాధవీకెరగా ఉండేది. గ్రామ దేవత అమ్మోరును మాధవీ దేవతగా పిలిచేవారు. కాలక్రమేణా పేర్లు రూపాంతరం చెంది గ్రామాన్ని మద్దికెరగా, అమ్మవారిని మద్దమ్మగా వాడుకలోకి వచ్చింది. ఆలయంలోని కన్నడ, తెలుగు బాషాల్లోని శిలాశాసనాలు చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. స్వస్తిశ్రీ విజయాభ్యుయా శాతావాహన శకం 1741లో రామప్పరాయలు ఈ శాసనం రాయించినట్లు తెలుస్తోంది.

అతి పెద్ద చెక్క విగ్రహం..

6 శతాబ్దాల క్రితం మద్దికెరలో వెలసిన మద్దమ్మ దేవత చెక్క విగ్రహంలో జీవకళ ఉట్టి పడుతుంది. ఇంత పెద్ద విగ్రహం రాష్ట్రంలో మరెక్కడా లేదనేది. ప్రతీతి. ఈవిగ్రహాన్ని ప్రతిష్ఠించ లేదని అక్కడే ఉన్న మద్ది వృక్షాన్నే విగ్రహంగా చెక్కినట్లు శాసనాలు చెబుతున్నాయి. అమ్మవారి పేరుతోనే మద్దికెర, మద్దమ్మ కుంట, మద్దమ్మ బావిని ఏర్పాటు చేశారు. అలాగే గ్రామంతో పాటు సమీప గ్రామాల్లో ఎక్కువ మంది మద్దమ్మ, మద్దికెరప్ప, మద్దన్న పేర్లు ఉంటాయి.


మద్దమ్మ బావి